తల్లిలేనిపిల్ల

(సాంఘికనాటకం)

విశ్వనాథ సత్యనారాయణ

షష్ఠాంకము

[రైలుదిగి దారిలో - కళింగరావు, రాజ్యం]

కళింగ—కూలివెధవ ఎంత వెనకున్నాడో!

రాజ్యం—వాడు మీయిల్లు ఎరుగడూ! అదేనా వూరు.

కళిం—అదికాక యింకేదవుతుంది.

రాజ్యం—స్టేషనుకి ఊరికి దూరమే.

కళిం—బండికట్టిద్దామా అంటే వద్దన్నావుగా.

రాజ్యం — సరదాగా నడుద్దామని కాదూ? మనం ఇద్దరమూ కలిసి నడుస్తోంటే సరదా! నన్ను మీయింటికి రానిస్తారా!

కళిం—మనం నాయుడుగారింటికి పోతాంగా. నాయుడుగారు చాలా సరదాఅయిన మనిషి. కవిత్వాలంటే, నాటకాలంటే ఆయనకి చాలా యిష్టం. నా చదువుకి డబ్బిచ్చింది అంతా ఆయనేగా!

రాజ్యం—ఇంతడబ్బిచ్చాడంటే మంచివాడన్న మాట.

కళింగ—మా 'మదరు' ఆయనా మారేజి చేసుకొంటా రనుకొంటా.

రాజ్యం—ఓహో! అల్లాచెప్పు.

కళింగ — కాని మాయింట్లో Old Hag ఉన్నాడు. అతనిమూలంగా వీలులేకండా వున్నది. ఆయన బి. సి. నాటివాడు.

రాజ్యం—వాణ్ణి ఇంట్లో ఎందుకుంచారు?

కళిం — ఊళ్లో మనవంక, చూశావా, ఎట్లా చూస్తున్నారో.

రాజ్యం — నాయుడుగారిల్లు ఇంకా ఎంత దూరం వుంది.

కళిం—ఈసందుమలుపు తిరగాలి. అదుగో! ఆ మేడ. నీవు ఈవూళ్లో వున్నంతసేపు నాతో చనువుగా వుండొద్దు. మనం పెళ్లిచేసుకొంటామన్నమాట ఎవరికి తెలియకూడదు.

రాజ్యం—వట్టి పిరికిలా గున్నావేం. ధైర్యం వుండాలి.

బుచ్చిమామ—(ప్రవేశించి) ఏమిరోయి కళింగం, అమ్మ వస్తా వనుకొంటూనే వుంది. ఈఅమ్మాయి ఎవరు?

కళింగ—స్నేహితురాలు. డాక్టరుపరీక్ష చదువుతోంది.

బుచ్చి—ఎవరు? బ్రాహ్మలేనా?

కళింగ—కాదు. బ్రహ్మసమాజంవారు.

బుచ్చి—ఇల్లువదలిపెట్టి యిట్లా ఎక్కడికి?

కళింగ—నాయుడుగారింటికి. ఈ అమ్మాయి నాయుడుగారికి చుట్టం. ఈవెణ్ణి అక్కడ దిగబెట్టి వద్దామని.

రాజ్యం — నే నాయన్ని ఎరుగను కూడాను. ఆయన నాకు చుట్టంకాదు, ఏమీకాదు.

బుచ్చి — నేనుకూడా వస్తానుపద, నాయుడింటికి.

కళింగ — నీవెందుకు తాతయ్యా! నీవెళ్లి అమ్మతో చెప్పు, నేను వస్తున్నానని.

బుచ్చి—నాయుడిగారితో నాకు పనుందిలే.

రాజ్యం—(విరగబడి నవ్వుతుంది.)

కళిం—ఎందుకు ఘొల్లువలె నవ్వుతావు.

రాజ్యం—అవును. ఘొలు అయితే నువ్వు కావాలి, లేకపోతే నేనుకావాలి. ఆయనమట్టుకుకాదు,

బుచ్చి—స్త్రీజాతిలో యిది క్రొత్తసృష్టే.

(తెరయెత్తగా- కళ్యాణి, సంగం, రాధ, రెనడే.)

బుచ్చి—నాయుడుగారూ, చుట్టాలు వచ్చారండి.

కళ్యా—రండి! రండి! ఓ! కళింగం. ఈవిడ ఎవరు?

బుచ్చి — నాయుడుగారేమో మంచివారను కొన్నా. చుట్టాలనికూడా మరచిపోతారే మీరు.

రాజ్యం—(విరగబడి నవ్వును.) నేనూ కళింగం స్నేహితులం. అతను బి. ఏ. ప్యాసవటంతోనే మేమిద్దరం పెళ్లిచేసుకొంటాం.

బుచ్చి—బాగుంది.

కళింగ—ఆవిడ ఎప్పుడూ అల్లాగే మాట్లాడుతుంది.

నాయుడు—కూర్చోండి. (అందరూ కూర్చుంటారు).

కళ్యా—ఆయనే కళింగరావు. వసుంధరమ్మగారి కొడుకు. ఈయన ప్రొఫెసరు సంగం అని మెస్మరిస్టు. వీరిద్దరినీ నీవు చూశేవుంటావు. ఆయన మహాకవి. ఈయన మాస్టారు రెనడే.

కళింగ — గుడ్ మార్నింగు. (అందరికీ షేక్ హేండ్లుఇచ్చి) ఈవిడ నాక్లాసుమేటు. పేరు కాంచన. నేను మాత్రం నారాజ్యంఅని పిలుస్తాను. అంతేకాదు రాజ్యం.

రాజ్యం—(నవ్వి - అందరికీ షేక్ హేండు ఇస్తుంది.)

(సంగం షేక్ హేండుయిస్తూ చెయ్యి నెమ్మదిగా లాగుతాడు. రెనడే మొగం వాలుస్తాడు. రాధ నవ్వుతూ ఆవిడవంక చూస్తాడు. రాజ్యం సంగంలాగితే హూ అని కేకవేస్తుంది. రాధకు మళ్లీ నవ్వువస్తుంది.)

సంగం—వారి కివ్వక్కరలేదా షేక్ హేండు.

బుచ్చి—నేను మళ్లీ స్నానంచెయ్యలేను. కొత్త జంధ్యాలు లేవు. ఎందుకు చంపుతారు?

కళ్యా—(నవ్వుతూ) ముట్టుకుంటేనే స్నానం చెయ్యాలా అండి.

బుచ్చి—నాకు షేక్ హేండు ఎందుకు? నాకేం యింగ్లీషువచ్చా, పాడువచ్చా. పైగా షేక్ హేండిస్తే లాగాలో నవ్వాలో ఏమీ తెలియదాయెనాకు. ఎందుకు లెండి.

కళింగ-(బుచ్చిమామవంక కోపంగా చూస్తాడు.)

రాజ్యం—ఇంగ్లీషురాని బూర్జుఇంతే.

బుచ్చి—ఏమన్నా తిట్టా ఏమిటండి, నాయుడుగారూ, అది?

కళ్యా — ఏ జ్బే కాదండి.

బుచ్చి—నీకు కోపం ఎందుకమ్మా! నాయుడూ, నీవు చెప్పవయ్యా. ఆవిడ ఏకులమో తెలియదాయెను! మాలదియేమో!

సంగం—బాబూ! మీకు ఇష్టంలేకపోతే వెళ్లండి. ఎందుకు వృథాగా మాఅందరకు కష్టంకలిగిస్తారు.

రాజ్యం—వీళ్లకు కులం, వర్ణమేతప్ప మనుష్యులన్నమాటేలేదు. పదిమందిలో మర్యాదన్నా తెలియదు.

బుచ్చి—మీకు కులభేదం, స్త్రీభేదం తెలియదు. కోపంఎందుకు. నామూలంగా మీకన్నో అభ్యంతరాలు వుంటయి. నేను వెళతాను. (నిష్క్రమణ)

రెనడే—నాకు పనివుంది, సెలవు.

(నిష్క్రమణ)

నాయుడు—కాఫీ అయిందా!

రాజ్యం—అయిందండి. అదేదో స్టేషనులో చేశాం.

నాయుడు—కళింగం, ఇంటికి వెళతావా?

సంగం—ఈయనవెళ్లి పుస్తేపులు పెట్టడు అక్కడ.

కళింగం—నేను వెళతాగాని రాజ్యం ఇక్కడే వుంటుంది.

కళ్యాణి-అక్కడికెడితే మీ తాతయ్యా కర్రుచ్చుకుంటాడు.

కళింగ—రాజ్యం ఒంటిగంటకుగాని భోం చెయ్యదు.

సంగం—ఇవ్వాళ ఏకాదశా!

రాధ—ఇప్పుడు బ్రెడ్ పుచ్చుకొంటారా!

సంగం—ఇవ్వాళ నేనూ అంతే.

కళ్యా—ఎంచేత? మీరుకూడ దొరలపద్ధతేనా? అయితే నీవు వెళ్లు కళింగం. మేము భోంచేస్తాం. మీ రొక్కరూ ఇక్కడ వుంటారా!

రాజ్యం—ప్రొఫెసరుగారుకూంటారన్నారుగా?

సంగం—నాకు కడుపులో జబ్బుగా వున్నది. చెప్పానుగా!

కళ్యా—అయితే బ్రెడ్ వస్తుంది. రాండి. రాధాకృష్ణగారు! నాకు ఇవ్వాళ ఆకలి అవుతోంది.

(రాధ-కళ్యా-నిష్క్రమణ)

సంగం—మీరు స్నానం చెయ్యరూ!

రాజ్యం—రాత్రికేనండి.

సంగం—మీరు డాక్టరు పరీక్ష యెన్నోయేడు.

రాజ్యం—మూడవయేడు.

సంగం—మీకు కళింగరావుగారికి ఎట్లా కలిసింది.

రాజ్యం—మాయింటిప్రక్కనే ఒకగదిలో అతనుంటున్నాడు. మీదేవూరండి? ఈవూరేనా!

సంగం— కాదు. నాయుడుగారి భార్యకు జబ్బుగా వుంటే నయంచేయటానికి వచ్చాను.

రాజ్యం—మీరు వైద్యంకూడా చేస్తారా!

సంగం—ఇది దేహ సంబంధమైన రోగంకాదు; మనస్సంబంధమైంది. దాన్ని నేను ఆత్మశక్తితో కుదురుస్తాను.

రాజ్యం—ఎల్లాగండి?

సంగం—మా గురువును తలచుకొని నాలో వున్న ఆత్మబలాన్ని ఆవిడమీద ప్రవహింపచేసి ఆవిడ మనస్సు నేను చెప్పినట్లు వినేట్టు చేస్తా. అది యోగశక్తి అంటారు.

రాజ్యం — అల్లా ఎవరిని పడితే వాళ్లని చేస్తారా? ఇపుడు నన్ను చేస్తారా!

సంగం—ఊరికే ఎందుకు? ఏదన్నా ప్రయోజనం వుండాలి.

(బంట్రోతు బ్రెడ్ తెస్తాడు. వెళతాడు)

(ఇద్దరూ చేతులు కడుగుకొని బల్లమీద ఆరగిస్తారు)

సంగం—మీకింకా కొంచెం బట్టరు కావాలా!

రాజ్యం—ఆ చంచా యివ్వండి. నేను తీసుకుంటా.

(సంగం యిస్తూ చేయిచేయి తాకిస్తాడు.)

రాజ్యం— నాయుడుగారి కేమాత్రం ఆస్తి వుందండి.

సంగం—ఒక లక్షరూపాయలున్నవని చెప్పుకుంటారు.

రాజ్యం—ఆయనభార్య కేమిటిజబ్బు?

సంగం—(నవ్వి) ఏమీ లేదు.

రాజ్యం—ఏదో వుంది. చెప్పాలి.

సంగం—కొందరు దేవతాప్రకృతు లుంటారు. వాళ్లల్లో ప్రేమ అఖండంగా వుంటుంది. కొందరు వట్టి కట్టెలు. వాళ్లే నీతి గీతి అని దేవులాడేది.

రాజ్యం—ఆవిడకి నాయుడుగారిమీద యిష్టం లేదా! అయితే యింకోళ్లని చేసుకోనేది.

సంగం—మనిషి స్త్రీ అయితే యేం, పురుషుడైతే యేం అనుభవించే శక్తిగల వ్యక్తి. లోకం అనుభవానికైన విషయం. అనుభవంలో ఆనందం వుంది. మనకున్న శక్తిని ఉపయోగిస్తే దానికి ఫలితం కనపడుతుంది. క్రైస్తవమతంలో దేవుడు చచ్చిపోయి స్వర్గా

నికి వెళ్లినవాణ్ణి అడుగుతాట్ట. 'నేను నీకిచ్చిన శక్తిని వృద్ధిచేశావా, నాశనంచేశావా' అని. వృద్ధిచేసినవాడు దేవునికి నచ్చినవాడు. ఈతత్వం ఆమతాలకి తెలిసి నట్లు మనమతానికి తెలియదు. మనవాళ్లు వట్టి లోభి ముండాకొడుకులండి, యెందులో చూచినాసరే.

రాజ్యం—మాకళింగంకూడా మంచి నూతనాభిప్రాయాలు కలవాడండి.

సంగం—ఏమి నూతనమండి చూడండి. ఇంటికి వచ్చాడా! ఇదిగో తల్లీ తాతా ముక్కుత్రాళ్లు బిగిస్తారు. దానితో గొడ్డు చచ్చిందన్నమాటే.

రాజ్యం—అతను చాలా స్వతంత్రుడు. ధైర్యం కలవాడు చూడండి. నన్నిక్కడికి ధైర్యంలేకపోతే తెస్తాడా!

సంగం—అది మీధైర్యం. మీకేనుండి, చదువుకున్నారు. కాఫీ యింకొంచెం పొయ్యనా-మీయిష్టం మీది. కళింగం కాకపోతే I. C. S. ప్యాసయినవాడు వస్తాడు.

(రాజ్యం చెంబా క్రిందపడితే తీసియిస్తాడు)

రాజ్యం—థాంక్సు. మీచెయ్యి చల్లగావుందే?

సంగం—అన్నమేది అసలు, పచ్చడిగా వుంటానికి గాని, చల్లగా వుంటానికిగాని.

రాజ్యం—దీన్ని యింగ్లీషులో పన్నింగు అంటారు. నాకు అదంటే అసహ్యము.

సంగం—బాగా పరిపక్వమైన బుద్ధికలవాళ్లకి అంతే. ఈకవి, యీయాక్టరు వున్నారే. వాళ్లు కొంచెం తక్కువచదువుకొన్నవాళ్లు. వాళ్లు యిట్లామాట్లాడితే చాలా సంతోషిస్తారు.

(రాజ్యం సిగరెట్టు నోటపెట్టుకొనును. సంగం నిప్పుపుల్లగీసి ముట్టిస్తూ)

సంగం—ఇది మిలిటరీవాళ్లకి మహాప్రమాదం. మీసాల కంట్టుకోవచ్చు.

రాజ్యం—మీసాలుచూస్తే నాకు ఒళ్లు తగలడుతుంది.

సంగం—మీవాళ్లు తగలట్టం ఎందుకు? వాళ్ల మీసాలే తగలడనివ్వండి. మీబుగ్గమీద బట్టరు కావలు అంటింది. (తాను చేతితో దుడుచును)

రాజ్యం—థాంక్సు.

(సేవకుడువచ్చి గిన్నెలు తీసివేయును)

సంగం—నాయుడుగారి భోజనం అయిందా?

(సేవకుడు నిష్క్రమించును)

రాజ్యం—నాసిగరెట్టు ఆరిపోయింది.

సంగం—నిప్పుపుల్ల ఒక్కటేవుంది. అది అయిపోయింది. ఇందండి వెలిగిస్తాను. మావేపున చుట్టలు ముట్టిస్తారు. అల్లా చూపించమంటారా!

(సిగరెట్టు ఇద్దరి నోళ్లల్లో వుంచుకొని వెలిగించి)

రాజ్యం—ఇది నాస్టీ హేబిట్.

సంగం—నోటికి నోటికి రెండుసిగరెట్లంత దూరం వుండగానే నిజంగా అసహ్యమే. పల్లెటూరివాళ్లు చేసుకొనేది. మీకేమన్నా వక్కపొడి అలవాటా అండి?

రాజ్యం—వక్కపొడి దొరలు తినరు.

సంగం—దొరసానులు తినటానికేం?

రాజ్యం—మీరు నన్ను పొగడుతున్నందుకు కృతజ్ఞురాలను. మీరు మధురంగా మాట్లాడుతారు.

సంగం—మీవంటివారు అల్లా అంటే చాలు. ఇల్లా చాలామంది అన్నారు. మీరిక్కడ యెన్నాళ్లు వుంటారు.

రాజ్యం — పదిరోజులన్నా వుంటా మనుకొంటాను. ఈవూరుపొలాలమీదిగాలి పీల్చాలి. పల్లెటూళ్లు చాలా ఆనందంగా వుంటాయండి. పచ్చికబయళ్లు, పచ్చనిచేలు!

సంగం—మీకు కొండలంటే యిష్టమాఅండి?

రాజ్యం—చాలాయిష్టం. అవిఅంటే పడిచచ్చిపోతా.

సంగం — ఇక్కడికి దగ్గరలో ఒకకొండ వుందండి. దానిమీద దోనలున్నవి. చాలా అందమైన ప్రదేశం. ఒకరోజున అక్కడికి వెళదాము!

రాజ్యం.—మాకళింగంకూడా వస్తాడు.

సంగం — ఇద్దరికన్న ఎక్కువైతే కంపెనీ బాగుండదు.

రాజ్యం—మరి అతను రాకుండా ఎట్లా? అతను వస్తానంటాడే! రెండుమూడు రోజుల్లో వాళ్లతండ్రి తద్దినంట. ఆరోజున నన్ను వదలిపెట్టాలిపొస్తుందేమో అన్నాడు.

సంగం— సరిపోయింది. ఆనాడు మనం వెళితే సరి. కొండ చాలాబాగుంటుంది లెండి.

కళ్యా—(ప్రవేశించి) అయిందా!

రాధ—(ప్రవేశించును.)

(తెర)

సప్తమాంకము

[ప్రదేశము-నాయుడి యిల్లు. రాధ, కళింగం, రాజ్యం, కళ్యాణి.]

రాజ్యం—ఇవ్వాళ సంగంగారు కనిపించలేదే?

నాయుడు— మేడమీద వున్నారు. మావాళ్లకు వైద్యంచేస్తున్నారు.

కళింగం—మీ సలహా ఏమిటి?

నాయుడు—ఏం చెప్పమంటావు? ఇందులో నాసలహాకన్న మీ తాతగార్ల సలహాయే మంచిది.

రాధ—తప్పుచేశానని పోయి పోలీసుస్టేషనులో చెప్పినట్లే. వెంటనే లాకప్పులో పెడతారు.

కళింగం—బ్రాహ్మలెవరూ రామంటున్నారు. మా అమ్మ నన్ను చంపేస్తోంది. నాకు రాజ్యం ఎక్కువా, ఈ తద్దినా లెక్కువా!

రాధ—ఈ తద్దినాలంతా నాన్సెన్సు. చచ్చిన వాళ్లని మనం చూడొచ్చామా! మనం యిచ్చింది వాళ్లకి అందుతుందని నమ్మకమేమిటి? ఇదంతా బ్రాహ్మల్ని మేపటం. ఈ బ్రాహ్మలంతా చేసిన దుర్మార్గం. ఏదో రూపేణా వాళ్లకి ముట్టాలి. లేకపోతే మనం తరించము.

కళింగం—వట్టి సూపర్ స్టిషన్. నాకిష్టంలేదు తద్దినాలు పెట్టటం. గోడమీద పిల్లివాటం. నాయుడుగారెటూ మాట్లాడరు.

నాయుడు—వస్తా. (నిష్క్రమణ)

రాధ—నావుద్దేశం చెప్పమంటారా!

కళిం—చెప్పండి.

రాధ—మొదటిపక్షం మానెయ్యండి. ఈ బ్రాహ్మల్ని ఏంచేస్తారో చేయనియ్యండి. రెండోపక్షం మీ వాళ్లే యిబ్బంది పడలేక పెట్టారా! నన్ను, ప్రొఫెసరు సంగంగార్ని భోక్తలుగా పెట్టి పెట్టండి. బ్రాహ్మలు రామంటే ఏంచేస్తారు?

రాజ్యం—నేనూ, సంగంగారూ రేపు, కొండ కెళదా మనుకొంటున్నామే.

రాధ—ఎల్లుండి అందరం కలిసి పోదాం.

నాయుడు—(ప్రవేశించి) బుచ్చిమామగారు వస్తున్నారల్లే వుంది. మేడమీదనుంచి చూస్తే వస్తున్నాడు. ఈమలుపు తిరిగాడు.

బుచ్చి—(ప్రవేశించి, వచ్చి కూర్చుండును.)

నాయుడు—ఏదండీ, రాధాకృష్ణగారూ, మొన్నటిపద్యాలు చదవండి! బుచ్చయ్యగారు వింటారు. వారు పండితులండోయి!

బుచ్చి—ఇప్పటి కవిత్వాలు నాకేం తెలుస్తయి!

నాయుడు—అంతే! మీకు తెలియకేం! చదవండి.

రాధ—"వెలుగురాచిన."

(రాధ మొదలుపెట్టటంతోనే నాయుడు నిష్క్రమించును.)

రాధ — (వెలుగురాని మొ. ౨ పద్యాలు చదువును).

కళింగం—ఆహా! ఏమి వండర్ ఫుల్ గా వున్నయ్యండి. నేను ముగ్ధుణ్ణి అయిపోయినాను. యూ ఆర్ ది గ్రేటెస్టు పొయట్.

రాజ్యం—చాలా బాగుందండి. మీగొంతు ఎంతబాగుంది. కళింగం, చూశావా! అడయార్లో మొన్న నెమిలిని చూశాం. కవిగారు 'వెలుగురాచిన' అన్నపుడు ఆనెమిలి కూసినట్లుంది కాదూ?

నాయుడు—(ప్రవేశించి) చదివారా!

రాధ—ఆ!

నాయుడు—ఎల్లా వున్నయ్యండి?

బుచ్చి—బాగానే వున్నయి.

నాయుడు — అల్లాకాదు. మీఅభిప్రాయం చెప్పండి.

బుచ్చి—నాకీకవిత్వాలు ఏమి తెలుస్తయి.

నాయుడు—అయితే బాగావున్నవని ఎందుకన్నారు.

బుచ్చి—మీరు పెద్దమనుష్యులు. మరీ ఏమనను.

రాధ—కాదండి: ఎల్లావున్నయ్యో చెప్పండి. మీఅభిప్రాయం మీరు చెప్పండి. తప్పులుంటే దిద్దుకుంటాను.

బుచ్చి—మొదట అల్లాగే అంటారు. తరువాత కోపాలువస్తవి.

రాధ—నిజంగా కోపంరాదు.

బుచ్చి—నిజంగా కోపం రాదన్నా వస్తుంది. కోపంరాదనే స్థితి ఆత్మకి వుంటే రాదుకాని నోటితో అంటే ఆగదు.

కళింగం — మాతాతయ్య అంతే! అదంతా వేదాంతంలెండి.

రాజ్యం—అంత అనుగుతోంటే చెప్పరాదండీ.

బుచ్చి—'బీరనరాలు' అంటే ఏమిటండీ!

గాధ—బీరనరాలంటే? ఏదో అందంగావుందని వేశాను.

బుచ్చి—అర్థం తెలియకండానే.

రాధ—అప్పుడేదో చూసే వేశానండీ. అది రైటే. (నాయుడు నిష్క్రమించును)

బుచ్చి—ఇల్లావుంటుంది. సరే. చరమార్గగీతిక అంటే?

రాధ—అట్లా అడిగితే చెప్పటం కష్టమండీ! తప్పులుంటే చెప్పండి. కవి ఆవేశంలో సాగసైనమాట వేస్తాడు.

బుచ్చి—ఒళ్లు తెలియని సివం సూడదు. చరమార్థం అంటే చివరిఅర్థం. దేనిచివర, జీవితం చివరా! అంటే చావు. అది అశ్లీలం. తరువాత "మెట్ల కిన్నెరతీగలు చిట్లిపోయె." తీగలు తెగిపోతయి. చిట్లవు. అద్దం చిట్లుతుంది. తెగిపోవటానికీ చిట్లిపోవటానికీ భేదం వుందంటారా, లేదంటారా! (నాయుడు ప్రవేశించును.)

బుచ్చి— నాయుడుగారు క్షమించాలి. అడిగారు కనుక చెప్పాలిసొచ్చింది - చూడండి. మెట్లకిన్నెర తక్కువకులాలవాళ్లు వాయించుకొనే వాద్యం. మీరు దానిమీద ఎల్లా వాయిస్తారు. వీణ అనండి. వేణు వనండి. బాగుంటుంది.

కళింగ—తక్కువకులాలవాళ్లది కనుకనే దాన్ని తీసుకుంది. లైఫు వాళ్లల్లో వుంది. మనలో ఏముంది.

నాయుడు—వారిని చెప్పనివ్వండి.

రాధ—మనకు బీదవాళ్లతో సానుభూతి వుండాలికదండీ!

బుచ్చి—సానుభూతివుంటే డబ్బివ్వండి. వాళ్ల కష్టాలు తొలగించండి. వాళ్ల అప్పులు తీర్చండి! కూటికీ గుడ్డకీ కొరతలేకండా చెయ్యండి. అంతేగాని సారస్వతంలో వాళ్లసంగతి వ్రాస్తేనే సానుభూతి వస్తుందా!

రాధ—ఇంకా రెండోపద్యం.

బుచ్చి—మళ్లీ చదవండి.

రాధ—(చదువును.)

బుచ్చి—సరే, మీరు తమసాకృతులు. అల్లా అనటంలో రసజ్ఞత్వం నాకు తెలియదు. 'కలలోదిగిన' ఏమిటి ?

కళింగ—(నవ్వి) కలలంటే డ్రీమ్సు. The flash of lightning in a dream. Some dreamy thoughts అన్నమాట. నీకు తెలియదులే. దాని కింగ్లీషు రావాలి.

బుచ్చి—అయితే తెలుగులో వ్రాయటం ఎందుకు.

రాధ—అదంతా తెలుగు చేస్తాం.

బుచ్చి—అప్పటికి అంతా ఇంగ్లీషు అయిపోతే తెలుస్తుంది.

నాయుడు—నాకు పనివుంది, వెళ్తాను.

(నిష్క్రమణ)

బుచ్చి—కళింగం! బ్రాహ్మలమాట ఏమిచేశావు.

రాధ—ఎవరూ రానంటే ఆయన స్నేం చెయ్యమంటారూ ?

బుచ్చి—అయ్యో! వస్తానే ఈ అమ్మాయిని పెళ్లిచేసుకుంటానని టముటమా కొట్టాడాయె. మరి బ్రాహ్మ లేలా వస్తారు ?

కళింగం—టమాటమా కొట్టేంటి నువ్వా, నేనా!

బుచ్చి—ఈ పిల్లని తేవటమే కొట్టటం.

కళింగం—నీవు నాతో మాట్లాడొద్దు. వెళ్లిపో.

బుచ్చి—నాకెందుకు లేరా నాయనా! అమ్మ పిలుస్తోంది. వస్తావా!

కళింగం—నేను రానుపో!

బుచ్చి—సరే; అమ్మ పిలవమంది. అందుకని వచ్చాను. నాకేం. (నిష్క్రమణ)

రాధ—వెళ్లిరండి.

కళింగం—(నిష్క్రమించును).

రాజ్యం—నేను పొరపాటు చేశా. ఇక్కడికి రావలసింది కాదు.

రాధ—ఇది మీ కట్లా తెలుస్తుంది. కళింగం చెప్పాలికింది.

రాజ్యం—పూర్ బర్డ్. అతనికి మేమిద్దరం సరదాగా రావటమే తెలిసింది. ఇంకోటి తెలియలా.

రాధ—మీరు యిల్లాంటి ఇబ్బందులు లేని చోటే పెళ్లి చేసుకోరాదూ.

రాజ్యం—అంటే మిమ్మల్ని చేసుకోమనా!

రాధ—నే నసలు పెళ్లి చేసుకోను. మాది ఫ్రీలవ్ థియరీ.

రాజ్యం—అయితే న న్నందులో చేరమంటారా!

రాధ—మాకు పెళ్లిచేసుకున్నా యిబ్బంది లేదు.

రాజ్యం—మీ సిద్ధాంతాలు నీ పాయత్రీలో లేవే !

రాధ—మీ రేమూల విన్నారు? ఇప్పుడు సంగంవుంటే ఏమంటాడో తెలుసునా! ఏమూలా అంటే, ఆగ్నేయమూలా, వాయవ్యమూలా అంటాడు. ఆయన విట్ అంతే.

సంగం—(ప్రవేశించి) లెండి; వెళుతున్నాం! మీరు లేస్తున్నారు! అనుగో! బయటికి వెళ్లాం! వెళ్లాం! మీరు లేచారు.

కళ్యాణి — (ప్రవేశించును) (సంగం-రాధ-రాజ్యం సమ్మోహితులై నిష్క్రమింతురు.)

కళ్యా—నేను ధర్మమైన పనిచేస్తున్నాను. కాని మనస్సులో అనుమానం తెగలేదు. ఆత్మ ఒకరిది. శరీరం ఒకరిది. ఏమి యీసంయోగం లేకపోతే? వసుధ నన్నంత ప్రేమిస్తోంది. కాని మాయిద్దరి శరీరసంయోగం ఆమెకు అక్కరలేదట. ఆదేవతామూర్తి ఆధర్మాన్ని నే నెందుకు స్వీకరించరాదు? ఈపాటికి బయలుదేరివుంటుందా! మెట్లుదిగి వస్తోంది ఇంతా ప్రయత్నంచేసి యిప్పుడు విరాగమెందుకు? ఆహా! నన్ను అందరూ మంచివాడంటారే? అందరూ ప్రేమిస్తారే! నాభార్య నన్నెందుకు

ప్రేమించరాదు. ఒకొక్కడిజన్మచమత్కారం. అన్నీ వున్నవి. నాకు స్త్రీసౌఖ్యం లేకపోయింది. అంత ప్రేమిస్తూన్న వసుధవల్లనే లేకపోతే యితర త్రా చెప్పాలా! ఇంకా రాలేదేమి? ఇందాకే మెట్లుదిగుతున్నట్లు వినిపించిందే. ఆవిడే వస్తుంది, విూరట్లుతిరిగి చూడవద్దన్నాడు సంగం. ఆవిడే వచ్చి పలకరించాలట. సరే! కానియ్యి. నాభార్య నన్నెందుకు ప్రేమించకపోవాలి. నేను ముసలివాడనా! నలభైయేండ్లు దాటలేదు. కురూపినా! చాలామంది స్నేహితులు కాదంటారు. పెద్ద అందగాణ్ణి కాకపోయినా కంటివాణ్ణి కాదు. గుడ్డివాణ్ణి కాదు. ధనమెంతో దేవుడిచ్చింది వుంది. లోకంలో ఒకానొక స్త్రీపురుషుల సంబంధం చూస్తే ఆశ్చర్యం అవుతుంది. పరమనీచకులంవాడు. పరమ వికారి. నిర్ధనుడు. మనిషి అసహ్యంగా వుంటాడు. స్త్రీమనస్సు వానిమీదికి పోతుంది. ఎవడుచెపుతాడు? పూర్వజన్మలో చేసుకొంటేగాని యేదీ లభించను. వట్టి బుద్ధిలేనివాణ్ణి, పరమలోభిని లక్ష్మివరించటంలేదా! అట్లాగే ఇంకోటేను. అడుగోవచ్చింది.

చంద్ర—ఏమిటో ఆలోచిస్తున్నారు.

నాయుడు—నా భాగధేయాన్నిగురించి.

చంద్ర—దానికేమి? ధనవంతులు. మంచివారు. గౌరవం కావలసినంతవుంది. ఇంకేం కావాలి?

నాయుడు—ఏమీ అక్కరలేదు. మనస్సు కష్టంగా వుంది.

చంద్ర—ఉక్కపోస్తోందేమో, విసరనా (పైటతో విసరును.)

నాయుడు—నీచేతులు నొప్పిపెట్టతై. ఊరుకో!

చంద్ర—రెండుగంటలయింది. ఫలహారం తెస్తా!

(నిష్క్రమణ)

నాయుడు—ఏమిటిది! మెస్మరైజు చేశాడా! మనిషి ఇంత సహజంగా వుంటుందా! నిజమో అబద్ధమో కాని భార్యతో సుఖమనుభవిస్తున్నట్లుంది. కొద్దిలోనే ఆమెను.

చంద్రం—(ఫలహారంతో వచ్చి) ఇంట్లో ఎవ్వరూ లేరేమి!

నాయుడు—మనం ఇద్దరమే వుండాలని.

(ఫలహారంచేస్తూ)

చంద్ర—నామీద అంత ప్రేమ యెందుకు?

నాయుడు—భార్యని ప్రేమించటం తప్పా?

చంద్ర—నా అదృష్టం నాకు తెలియలేకపోలేదు. మూతి కంటుకుంది. (చేతితో తుడుచును). తామలపాకులు తెస్తా. (నిష్క్రమణ)

నాయుడు—నాకు కవిత్వమూ రాదు, సంగీతమూ రాదు. అందుకు సంతోషిస్తున్నా. వసుధ ఏమన్నది, సీతాదేవి రామచంద్రుణ్ణి తాకితే హరిచందన కుంకుమల ఆశ్చోతనంలా వుందా! అవును. నిజమే. విషవిసర్పమూ, మదమూ అనుకొన్నాడట ఆయన. చంద్రంచేయి నాకు తాకిందా. తాకింది.

(కన్నీళ్లుకార్చును)

చంద్ర—(ప్రవేశించి)—(ఆదుర్దాతో) కన్నీళ్లెందుకు. (దగ్గరకూర్చుని పైటతో తుడుచును).

నాయుడు—ఇంత ఆనందం నేను భరించలేను.

(కన్నులుమూసికొని పడిపోవును. చంద్రం అతని తల తొడమీద చేర్చుకుంటుంది.)

నాయుడు—(కళ్లుతెరచి) నీవు నాచంద్రానివేనా?

చంద్ర—నేను మీచంద్రాన్నే. తామలపాకు లీనలు తీసియివ్వనా?

నాయుడు—చంద్రం! చంద్రం!

చంద్ర—ఏమిటి చెప్పండి?

నాయుడు—నేనింక చచ్చిపోయినా ఫరవాలేదు.

చంద్ర—అశుభంగా మాట్లాడుతారేమి?

నాయుడు—(లేచి) వీళ్లందరూ ఎక్కడికెళ్లారో?

చంద్ర—ఇప్పుడెవళ్లు కావాలి ?

నాయుడు—కవి కావాలి. ఆయన వుంటే ఏదైనా పాట పాడుతాడు.

చంద్ర—మీరు పాడమంటే నేను పాడగలను. కాని మీరు నాతోడమీద పడుకోరాదా ! నాచేత అడిగించాలా? మీ ప్రేమంతా ఆత్మలోనే వుంటోంది.

నాయుడు—మనం సావట్లో వున్నాము. పాడు.

చంద్ర—చిన్నపుడు మా నాన్నగారు నాకు రుక్మిణీ కళ్యాణం, గజేంద్రమోక్షణం, ప్రహ్లాదచరిత్రా అన్నీ చెప్పారు. రుక్మిణీకళ్యాణంలోది చదువుతాను.

"ఘనున్ లోకమనోభిరాము, కుల వి
ద్యారూప తారుణ్యసౌ
జన్యశ్రీబలదాన శౌర్యకరుణా
సంశోభితుని నిన్నునే
కన్యల్ కోరరు, కోరదే కును రమా
కాంతాలలామంబు, రా
జన్యానేకప సింహా! నావలననే
జన్మించెనే మోహముల్."

నాయుడు—నన్ను మోసంచేసేందుకు ఏచిన్న కాలునైనా చాలునే. భాగీరథీదేవి బయలుదేరి వచ్చిందెందుకో!

చంద్ర—నేను మోసంచేస్తున్నానా! శ్రీకృష్ణ దేవునిమీద ఒట్టు పెట్టుకుంటున్నా. నేను త్రికరణశుద్ధిగా మిమ్మల్నే నమ్ముకున్నా! కావలిస్తే నన్ను పరీక్షించుకోండి.

నాయుడు—ఎవరో వస్తున్నారు. నీవు మేడమీదికి పద! (చంద్రం నిష్క్రమించును)

నాయుడు—ఈకృతక సౌఖ్యం అనుభవించనా! వద్దా! వసుంధరా వసుంధరా!

(తెర)

అష్టమాంకము

[వసుధయిల్లు. బుచ్చిమామ - వసుధ - భగీరథ - శాస్త్రి - కళింగరావు.]

బుచ్చి—బాగానే వుంది. ఎవళ్లూ మాట్లాడక పోతే ఏమిటి లాభం ? పదినిమిషాలనుంచి ఒకటే మౌనమా !

వసుధ—ఏమనమంటావు మామయ్యా ! ఎవరయినా వస్తారేమో నీవుపోయి మాట్లాడిరా !

బుచ్చి—అమ్మాయీ ! నిన్నమొన్న నా పడ్డ పాట్లు భగవంతుడికి తెలుసు. ఊళ్లో అంధరూ కట్టు కట్టారు. అప్పటికీ చుట్టుపట్ల నాలుగైదూళ్లకి అబ్బాయిని పంపించాను. ఎవళ్లూ ఒప్పుకోలేదట. ఏంచెయ్యను?

కళింగ—ఎవళ్లూ రాకపోతే నాయుడుగారింట్లో వున్నారు, రాధాకృష్ణగారని కవి. ఆయనాను, మెస్మరిస్టూ, వీళ్లిద్దరినీ పెడతాను. వాళ్లు మాత్రం బ్రాహ్మలు కారా !

బుచ్చి—నువ్వు పెట్టేటప్పుడు వాళ్లిద్దరూ పనికి వస్తారు.

కళింగ—మీరంధరూ అంతకన్న ఏమెక్కువ? కవిగారు చక్కగా చదువుకొన్నాడు. సంగంగారు మంచియోగి. మీఅందరిబ్రాహ్మలకన్న లక్షరెట్లు నయం.

బుచ్చి—సరే ! పెట్టండి. నేనుమాత్రం రాను.

వసు—మరెవ్వరూ రాకపోతే తద్దినం ఏమి కావాలి మామయ్యా !

బుచ్చి—మీరు బ్రాహ్మణ్యంలో వుండాలంటే ఒక్కటేమార్గం. ఆపిల్లని యివ్వాళ ఊరు పంపించేశెయ్యాలి. కళింగాయికి రేపు ప్రాయశ్చిత్తం చేయించాలి. ఇహ వీడు సరిగ్గావుండాలి. అప్పుడుకాని వ్యవహారం కుదరదు.

కళింగ—నే నాపిల్లని పెళ్లిచేసుకుంటాను. మీరెవ్వరూ నన్ను పోషించటంలేదు. నాచదువుకి డబ్బు కూడా నాయుడుగారే యిస్తున్నారు. తక్కిన మూడు నెల్లకి ఆయన్ని నేనే అడుగుకుంటున్నాను. నేను వెళ్లిపోతాను.

వసు—తండ్రి తద్దినం పెట్టవుట్రా. కనీసం రేపు ఆబ్దికమన్నా జరగనీయి. తరవాత నీయిష్టం.

భగీ—తరవాత వచ్చే అన్ని ఆబ్దికాలు చెడిపోయే టప్పుడు రేపటిది వాడితండ్రికి మోక్షం యిస్తుందా?

బుచ్చి—ఆయన చూడు. మధ్యవర్తిఅల్లే మాట్లా డుతాడు. అసలు ఆయనకాదు ఇదంతా చేసింది.

వసు—నాయనా! నిన్ను బతిమాలుతున్నాను. తరువాత నీయిష్టంవచ్చినట్లు చేద్దువుగాని, రేపటికి మాత్రం బుచ్చిమామ చెప్పినట్లు పోనియ్యి నాయనా!

కళింగం—ఈ ప్రాయశ్చిత్తం గీయశ్చిత్తం నేనొప్పుకోను. దీనికి నాకర్మమేమి కాలింది.

భగీ—మళ్లీ కర్మమంటావేమి? కర్మను, ప్రారబ్ధము మొదలయినవన్నీ వదిలితేనే యిల్లాంటి బుద్ధులు.

కళింగం—మీరందరూ మోక్షానికి వెళ్లండి. నేను నరకానికి పోతా. ఈకర్మల్లో నాకు నమ్మకం లేదు. నేను పెట్టను.

బుచ్చి—ప్రతివెధవకీ నమ్మకమే. నీ తాహ తెంత, నీకు నమ్మకముండేందుకు. అబ్బో! మహాపండితుడు బయలుదేరాడు. వెధవ నాలుగింగ్లీషుముక్కలు వచ్చేటప్పటికి ధర్మశాస్త్రవేత్త అయినాడు. వీడు! వీడి కొంక నమ్మకం! నమ్మకంట! నమ్మకం! వెధవ! నాలుక లాగితే గూబకొరికి తెలుస్తుంది.

కళింగం—ఇదిగోనయ్యో! మాటలు సరిగా రానియ్యి. పెద్దవాడవని చూస్తోంటే.

బుచ్చి—ఎందుకు? పెద్దవాణ్ని అని చూట్టం ఎందుకు. ఏమిటి పెద్ద. నీకు తండ్రియే పెద్దలేదు. పెద్దవాళ్లనివుంటే వాళ్లమాట విను. తద్దినం ఎగకొట్టేందుకు పెద్దలేదూ! దేనికి పెద్ద. తిరిగి తిట్టటానికి పెద్దా! ఎందుకు ఈ పెద్దరికం? మర్యాదా? ఈ మర్యాద ఈ ఇంగ్లీషుచదివినవారికి మహాలావు.

భగీ—ఒరేయి కళింగం, ఇటు చూడు. నీవు మాట్లాడితే రీజన్ రీజనంటావు కదా! ఇందులో రీజనుందేమో చూడు. నీవు పెద్దవాడవన్నావు. పెద్దవాడు కనక ఏమీ అనకూడదని యెక్కడుంది. ఆచారమేనా! అదేదన్నా నీవు చెప్పే కామనుసెన్సా! అలాంటిదే అనుకో, చచ్చినవాళ్లకి తద్దినం పెట్టటం రెండూ ఒకటేగా చూడు.

బుచ్చి—ఆచూట్టం తెలిస్తే ఇల్లా ఎందుకు వుంటాడు?

కళింగం—నేను తద్దినం పెట్టననటం లేదు. బ్రాహ్మలు రాకపోతే నేనేం చేస్తాను.

బుచ్చి—అత్తనోట్లో గిద్దకొట్టి, 'అత్తా! నీకేం కావా'లని అడిగిందట, నీబోటి కోడలు. వాళ్లు రాకండా చేసింది నువ్వేగా. ఎవతెనో మాలదాన్ని తెచ్చి దాన్ని పెళ్లాడతానంటే ఎవడు వస్తాడు నీయింటికి.

కళింగం—రాకపోతే మరీ నయం.

బుచ్చి—నీవంటి వెధవలు ఇంకేమంటారు.

కళింగ—వెధవలంటే మళ్లీ వెధవలంటారు.

వసు—ఒరేయి! నీకు బుద్ధిలేదురా! నోరుముయ్యి! పెద్దవాడాయనంటే మళ్లీ అంటావురా!

బుచ్చి—ఒరేయి! చెపుతున్నా! ఇంక మీ అమ్మ తాతయ్యని చూసి వూరుకోనేదిలేదు. నీఆటలు నీమెడ్రాసుపోయి ఆడు. ఇక్కడ ఆడావంటే ఎముకలు విరుగతవి. జాగ్రత్త. ఎవరనుకొన్నావు.

కళింగ—నీవు ఎవరనుకొన్నావు అంటే మళ్లీ అనేదే.

భగీ—ఎముకలు విరిగించుకోనేదే!

వసుం—ఒరేయి! ఆయన తలుచుకుంటే నీ వెంతరా? నోరుమూసుకు ఊరుకో! చాలులే మామయ్యా! కుర్రకుంకతో ఏమిటి? వీడు నోరుమూసుకొని ఊరుకోడాయె.

బుచ్చి—మీ యిష్టమమ్మా! నేను వెళ్లిపోతున్నాను. (బయలుదేరును)

వసుం—మామయ్యా! ఏదో ఒకటి చెప్పిపో!

బుచ్చి—నిజంగా చెప్పమంటావా! చెపుతున్నా విను. ఆవు చేలో మేస్తోంటే దూడ గట్టున మేస్తుందా? నీవు తలవెండ్రుకలు తీయించవు. చీరలు వాలు

జడలు వేస్తావు. ఆమహాతల్లికడుపున పుట్టావు. నిన్నేమీ అనలేను కాని, లోకము లక్షవిధాల చెప్పుకుంటోంది. చెప్పుకుంటోంది అంటే దానికప్పూ లేదు. నీవూ నీతండ్రీ కలిసి యీపుకుణ్ని యింతవరకు తెచ్చారు. రేపు నీతలవెంక్షికలు తీయించుకుని నీమార్గం నీవు మానితే, ఆయనగారు ప్రాయశ్చిత్తం చేయించుకొంటే రేపు తద్దినం. లేకపోతే ఆయన చెప్పాకుగా. వారిద్దరిని భోక్తలకి పిలిచేది; పెట్టేది. ఇల్లాంటి తద్దినాలు లోకంలో చాలాజరుగుతున్నవి. ఇక్కడింకా వుంటే మీవాడిచేత తన్నులుకూడా తినాలేమో! ఇంకెందుకులే. (నిష్క్రమించును)

వసు—నాయనా! కొంపమీది కెంత తెచ్చావురా!

కళిం—నేనేకాదు. నీవూ తెచ్చావంటున్నాడు. ఆయన యెట్లాంటివాడనుకొంటున్నావు. అసలు సంగతి విన్నావా! కడుపులో కుళ్లదీఅసలు.

వసుధ—అయితే నేను తలవెంక్షికలు తీయించుకుంటాను. నీవు ప్రాయశ్చిత్తం చేయించుకొంటావా!

కళిం — నీవు తలవెంక్షికలు తీయించుకున్నా సరే, ప్రాణాలు తీయించుకున్నా సరే. నేను వెళ్లిపోతున్నాను. ఇవ్వాళరాత్రికే మెడ్రాసు బయలుదేరుతాను. నాతో తిప్పలు మీకెందుకు. (పోబోవును)

వసుధ—నాయనా! నన్ను వదలిపోతావా! తల్లికన్న యెక్కువరా ఆపిల్ల నీకు. నిన్ను చేతుల్లో యెత్తుకు పెంచానే! నాయనా! నీకు సర్వస్వాకిరీ చేశానే. ప్రాణాలన్నీ నీమీద పెట్టుకున్నానే! నీవేమో నాతల పుల్లు కడిగి రక్షిస్తా వనుకొన్నానే. ఎవత్తెనో చూశి దానికోసమా యిదంతా!

కళింగ—అది ఎవత్తో నా! అది నాప్రాణం. ప్రేమ అన్నింటికన్న గొప్పది. ప్రేమకి ఇంకో భావానికి ఏమిటి సంబంధం. తల్లికన్న, తండ్రికన్న, లోకం కన్న ప్రేమఎక్కువ. (పోబోవును)

వసుధ—నాయనా! పోకురా! ప్రేమ యే స్త్రీతో పడితే ఆస్త్రీతో కలుగుతుంది. లోకంలో ఎవరినో ఒకరిని కలవటం కలుగుతుంది. ఆసందర్భం పరిచయంగా మారవచ్చు. ఆపరిచయం వృద్ధిఅయితే ప్రేమ అంటాము. పైగా ఆప్రేమలో శరీరసౌఖ్యం, శరీరాభిమానం ఎంతవుంది. ఆస్త్రీకాకపోతే యింకో స్త్రీ అయినా ఆప్రేమ కలుగుతుంది. అది దైవికంకాదు. ఒకవేళ దైవికమయినా తల్లీ తండ్రుల సంబంధమంత దైవికంకాదు. పొరపాటు పడుతున్నావు. దుష్టసిద్ధాంతాలల్లో పడి చెడిపోతున్నావు.

కళింగ—ప్రేమముందర ఇంకోటి నిలవదు. నేను నీకడుపున కాకపోతే యింకోరికడుపున పుట్టేవాణ్ణి. మాతాపుత్రసంబంధం శరీరానికి సంబంధించినది. భార్యాభర్తృసంబంధం ఆత్మకి సంబంధించింది.

(పోబోవును)

వసుధ—ఋషులకు, కామక్రోధాలు చంపుకొన్నవాళ్లకి, శరీరసంబంధం వదుల్చుకొన్నవాళ్లకీ ఆత్మసంబంధం ఎక్కువది. అటువంటి ఆత్మజ్ఞానం వుంటే శరీరంలేదు. ఆత్మని ఈశరీరమే క్రిందికి లాగుతోంది. ఈశరీరంతో వున్నవాళ్లు శరీరమే బలవత్తరమైంది. ఆత్మని వెదకటానికి పోతూ శరీరసంబంధాలు కోసేస్తే న్యాయమేకాని, రెండు శరీరసంబంధాలల్లో అధమమైనదాన్ని అధికమైనదానికన్న గొప్పదని దుర్వ్యాఖ్యానం చెయ్యటం న్యాయంకాదు. నాయనా! పోకురా! తండ్రీ! పోకు.

కళింగం—ప్రేమ శరీరాన్ని దాటిందని మహర్షులు చెప్పినమాట. ఆప్రేమముందు తల్లితండ్రులు లెక్కలేదు. నేను ప్రేమిస్తున్నది రాజ్యంలోని ఆత్మను కాని రాజ్యంశరీరాన్ని కాదు. నేను మహావిషయాన్నే గ్రహించాను. (వెళ్లిపోతున్నాడు)

వసుధ—రాజ్యం శరీరాన్ని కాదు నీవు ప్రేమించేది. సరే! ఆవిణ్ని పంపించేశెయ్యి. ఆవిడ ఆత్మని ఇక్కడనుంచే ప్రేమించు. ఒక్క ఆవిడ ఆత్మ నేమి? సర్వాత్మలను ప్రేమించు. శరీరం కాదుగా నీ ప్రేమకి స్థానం. నాయనా! పొరపాటుపడుతున్నావు. నీవు ఆమెశరీరాన్నే ప్రేమిస్తున్నావు. నాయనా, నీ

ప్రేమ సౌఖ్యాన్ని వాంఛిస్తోంది. ఆ సౌఖ్యం శరీర సౌఖ్యం, మానసిక సౌఖ్యం. ఆత్మని ప్రేమించేవాడికి ఈ రెండు సౌఖ్యాలు అక్కరలేదు.

కళింగ — అవును. నేను దానికోసమే పోతున్నాను.

వసు—అది యితరత్ర యింతకన్న బాగా లభిస్తుంది.

కళింగ—ఇంత చదువుకున్నది, అల్లాంటి సంస్కారంకలది దొరకదు. అంత పరిపక్వమైన హృదయం కల మనిషి దొరకదు. రాజ్యమంటే మరో రాజ్యం.

వసు—సంస్కారం పుస్తకాలు చదివితేనే రా అక్కరలేదు. సాంప్రదాయంలో పెరగటంకూడా చదువే. అసలు నెత్తురులో చదువుంటుంది. ఒకయింట పుట్టిన పిల్లకి ఒక చదువు, ఒక గుణము తెలుస్తుంది. దాని ఆచారాలు వేరు. నీవెంత చెడ్డా మాంసం తినవు. దానికి బజారునుంచి మాంసము తెచ్చిపెట్టలేకన్నా యిబ్బంది పడతావు. ఒకవేళ అదీ యిష్టమయితే నీవు నాకడుపున పుట్టావు. దానికున్నంత కామం నీకుండదు. నీనెత్తురులో లేదు. రక్తం? రక్తంలో ఎంత వుంది? నీమనస్సు నీనెత్తురునుబట్టి వుంది. నీచదువు, నీ సంస్కారం, నీ యిష్టానిష్టాలు అంతా నీశరీరంలోని రక్తముయొక్క ప్రత్యేకగుణాన్నిబట్టి వున్నయి. అయ్యో! నీతెలివితేటలు మలచినవాడెవ్వడురా! వాడి సిద్ధాంతాలు కాలిపోను.

కళింగ—నీసిద్ధాంతాలకన్న వాడి సిద్ధాంతాలు ఎన్నోరెట్లు మంచివి. నీ వాడదానవు. ఇంట్లో కూర్చుని వంటచేసేదానవు. వాడు రాజ్యం చేస్తున్నాడు. నీకు మల్లే గాజులు తొడిగించుకు కూర్చోలేదు.

వసు—గాజులు బద్దలుకొట్టించుకోవలసిన సమయంలో తొడిగించుకొన్నాను. తప్పే.

కళింగ—అందుచేతనే నోరు మూసుకు కూర్చో. నేను వెళ్లుతున్నాను. (పోబోవును)

వసుధ—నీకింగ్లీషు చెప్పిస్తే ఉద్యోగం చేస్తావనుకొన్నాను. మూలచ్ఛేదం చేస్తావనుకోలేదు.

కళింగ—మరి పెద్ద తెలివికలదానివల్లే మాట్లాడుతున్నావే. ఈమాత్రం తెలియలేదా!

వసుధ—తెలియలేదు. మీనాయన చచ్చిపోవటంతోనే నా తెలివి పోయింది.

కళింగ—అనుభవించు అయితే.

వసుధ—అనుభవిస్తున్నా.

కళింగ—అయితే వెళుతున్నా.

(పోబోవును)

వసుధ—తండ్రీ! వెళ్లకురా! వెళ్లకు. నాగొంతు నిన్ను పిలచి పిలచి బొంగురుపోతోంది.

కళిం—ప్రేమ బలవత్తమంగా వుంది. వెళ్లిపోతున్నా. (నిష్క్రమించును)

వసు—ఓరీ! వెళ్లావా! వెళ్లావా! ఆహా! ఏమి, కొడుకు. ఛీ! ఛీ! నీకు సుఖం లేకుండా పోతుం. దిపో! ఇది తల్లి పెట్టిన శాపం అనుకో! నేనుచచ్చిపోతా ఇంకా బ్రతికియెందుకు. (మూర్ఛ)

భగీ—అమ్మా! కర్మ! పురాకృతకర్మ! లే.

(తెర)

న వ మా ం క ము

(నాయుడుఇల్లు సావడి. నాయుడు - కళింగం ఒకచోట; నడే సంగం ఒకచోట; రాధ - రాజ్యం ఒకచోట.)

కళింగ—నేను యిల్లు వదలిపెట్టాను. మీరు లకుచెప్పండి నేనుపోను. నా యీచదువు పూర్తిఅయ్యేదాకా మీరు సహాయం చెయ్యండి! ఇది మీకు తప్పదు. చేస్తారో చెయ్యరో చెప్పండి.

నాయుడు—చేస్తానుగాని తల్లిమీద తిరగడటం న్యాయంకాదు.

కళింగ — ప్రేమ యెక్కువా, ఈ యిల్లు ఎక్కువా? మీరుకూడా చెప్పండి. మీరు ప్రేమ అగ్రస్థానం యిస్తున్నారా, ఇవ్వటంలేదా?

నాయుడు — ప్రేమే అన్నిటికన్న గొప్పది. కాని యీమధ్య నాఅభిప్రాయం కొంచెం మారింది. ప్రేమకన్న ఎక్కువైనవి యింకా ఉన్నయ్యల్లే వుంది. శరీరసౌఖ్యంకోసం ఎందుకు అంత చూడాలి? ఈ శరీరసౌఖ్యం ప్రేమ అని ధర్మాన్ని ఎందుకు పాడు చెయ్యాలి? ధర్మం ఎక్కువా, ప్రేమయెక్కువా?

కళింగ—ప్రేమయే ధర్మం; ప్రేమకన్న ధర్మం లేదు.

నాయుడు—స్త్రీ పురుషుల మధ్యగల ప్రేమ మాత్రమే ప్రేమా? తండ్రీకొడుకులమధ్య ప్రేమలేదా? సర్వభూతములమధ్య ప్రేమలేదా? స్త్రీపురుషులమధ్య కలది ప్రేమకాదు, కామము.

కళింగ—మీరనుకొన్నట్లు నే ననుకోటంలేదు.

నాయుడు—పూర్వం నేనూ అనుకోలేదు.

కళింగం—మీరు మునుపటికన్న బాగా ఊహించారని నమ్మకం ఏమిటి? నిజమైనదాన్ని వదలి అబద్ధమైనదానిమీదికే తిరుగుతోందేమో మీ మనస్సు.

నాయుడు—అంతా అనుమానం. పూర్వమే అజ్ఞానంలోవుండి యిప్పుడే జ్ఞానంలో వున్నానేమో? ఈసిద్ధాంతాలు ఇష్టానిష్టాలమీద వుంటయి.

కళింగ—డబ్బుమాట ఏంచెప్పారు?

నాయుడు—ఇప్పు డెంతకావాలి.

కళింగ—ఒక వందరూపాయలు. ఇవికాక ఇంకా రెండువందలు పంపిస్తేచాలు. తరవాత నాబ్రతుకు నేను బ్రతుకుతాను.

నాయుడు—ఇవి నేనిస్తే మీఅమ్మగారికి కోపం వస్తుందేమో.

కళింగ—అయితే యీవందమాత్రమేయివ్వండి.

నాయుడు—సరే. మూడువందలు ఇస్తాను.

సంగం—కళింగం రాజ్యాన్ని తీసుకువెళ్లిపోతాట్ట.

రెనడే—మీరు నాయుడుగారింట్లో నయం చేశారా!

సంగం—ఆ! నేను రేపో ఎల్లుండో వెళ్లిపోతాను.

రెనడే— అబ్బో! మీరు అసాధ్యులు.

సంగం—ఏంచేశాను.

రెనడే—మీకు తెలియదా! ఎవళ్లమనస్సు వాళ్లకే సాక్షి.

సంగం—చెప్పు.

రెనడే—నే నొక్కణ్ణే అన్నానా ఏమిటి? ఊరంతా అంటున్నారు.

సంగం—ఎవళ్లపాపాన వాళ్లేపోతారు. చెపితే సమాధానం చెపుతా. దాస్తే ఒట్టు.

రెనడే—మీకూ, నాయుడుగారి భార్యకూ—

సంగం—సీతాదేవినిగురించి అంటే రాములవారి దగ్గర సాగినట్లు చంద్రమతీదేవిగారిని గురించి అంటే నాయుడుగారివద్ద సాగదు. ఆవిడ చాలా పతివ్రత. భగవంతుడిమీద ఒట్టేసుకొని చెపుతున్నాను. నీవు తెలివితక్కువవాడివి. మంచివాడివి కనక చెపుతున్నాను. ఆవిడని మొదట నేను కొంచెం చెడ్డమార్గంలోకి త్రిప్పుదామని చూశాను. అట్లా ఇదివరకు చాలామందిని చేశాను. ఆపాపం వేరు. ఈవిడ చాలామంచిది. ఆవిడనిగురించి ఏమన్నా అంటే పుట్టుగతులుకూడా వుండవు. ఆవిడా మంచిది. నాయుడుగారూ దేవుడువంటివాడు. వారిద్దరూ సుఖంగా బ్రతకటం లోకానికి కళ్యాణం.

రెనడే—నాయుడుగారికి నమస్కారంచేసినా తప్పులేదు. అయితే మీరు రేపు వెళతారన్నమాటే.

సంగం—నాయుడుగా రుండమంటున్నారు కాని నాకూ పనులున్నవి. వెళతాను.

రెనడే—ఒకసహాయం చేసిపెటతారా!

సంగం—చెప్పు.

రెనడే—ఈరాజ్యాన్ని నేనుమద్రాసులో ఎరుగుదును. అక్కడ నేను వేషాలువేసినపుడు ఈవిడ వచ్చింది. నన్ను చాలా మెచ్చుకుంది. తరవాత కొంతగ్రంథం నడిపాను, గాని చివరకు ఆవిడ తిరస్కరించింది.

సంగం—అందరికీ అంతేనా! నాకూ అంతే. ఆ అమ్మాయి పైకి అట్లావున్నా లోపల కళింగాన్నే ప్రేమిస్తోంది. పాపం అతను చూడు. ఆవిడకోసం ఎంత వదిలిపెడుతున్నాడో. ఆవిడను పాడుచెయ్యటానికి ప్రయత్నంచెయ్యటంకూడా తప్పు. సరే. నువ్వు ఎప్పుడు వెళ్లిపోతావు.

రెనడే—నేనూ రేపే వెళతాను. మామామయ్యని చూచిపోదామని వచ్చాను. పనేముంది.

సంగం—ఏదీ! వెళ్లేలోపుగా ఆకీర్తనా పద్యం అనిపో!

రెనడే—పోవయ్యా! నీఅల్లరి.

* * *

రాధ—నన్ను ప్రేమిస్తున్నావా! లేదా!

రాజ్యం—ప్రేమిస్తున్నాను.

రాధ—అయితే కళింగంవెంట వెళ్లిపోతానంటావేమి?

రాజ్యం—కళింగం నారాజు. నేను అతని రాజ్యాన్ని. నిన్ను ప్రేమించటం ఊరికే ప్రేమకోసం.

రాధ—నిన్ను నేను పెళ్లాడతాను. ఒప్పుకుంటావా?

రాజ్యం—నీది Free love గాదూ! పెళ్లి ఎట్లా ఆడతావు.

రాధ — నీకోసం ఆడతాను. నీవంటిరత్నం దొరకుతూంటే ఒకసిద్ధాంతం లెక్కఏమిటి? దాన్ని తృణీకరిస్తాను.

రాజ్యం—ఒకవ్యక్తికోసం ఒకసిద్ధాంతం తృణీకరించేవాళ్లని నేను తృణీకరిస్తాను.

రాధ—అయితే కళింగం అదే చేస్తున్నాడు. నీకోసం తల్లిని, కుటుంబాన్ని వదిలిపెడుతున్నాడు.

రాజ్యం — అతనికి ఆసిద్ధాంతంలో నమ్మకం లేదు.

రాధ—నాకూ Free love లో నమ్మకంలేదు.

రాజ్యం—ఛీ! ఛీ! నోరుముయ్యి!

రాధ—నోరుమూస్తే చెయ్యి ముద్దుపెట్టుకుందామనా.

రాజ్యం—నిలకడలేని చెయ్యి ముద్దుపెట్టుకొని ఏమిలాభం.

రాధ—నీవూ పాతసరుకే? పో!

కళింగ—రాజ్యం?

రాజ్యం—వెళదామా?

కళింగం — స్నేహితులతో మాట్లాడుతున్నావట్లేవుందే.

రాజ్యం—నా రాజు పిలుస్తోంటే స్నేహితులడ్డమొస్తారా!

కళింగం—బయలుదేరు.

రాజ్యం—(గంతువేసి) రెడీ!

నాయుడు—నేను వాళ్లని పంపించివస్తా.

(నాయుడు, రాజ్యం, కళింగం తక్కినముగ్గురికి షేక్‌హాండ్లు ఇచ్చి నిష్క్రమింతురు).

సంగం—కవిగారి కేమన్నా లాభం కలిగిందా?

రాధ—ఎక్కడన్నా బావ అనుగాని వంగతోటదగ్గర కాదన్నట్లు.

సంగం—వినవయ్యా! రెనడే! ఏదీ ‘ మీర జాలగలడా ’ పాడు.

రెనడే—నాకు రాదు.

సంగం—పాడకపోతే ఎరుగుదువుగా.

రెనడే—ఏహే! పో! నీతోగోల. (పాడును)

సంగం—ఆహా! తెలుగుదేశమంతా మారుమోగిపోతోంది.

రెనడే—ఇందుకునేనా పాడమంది.

సంగం—నీవే రెట్టి అన్నానా?

రెనడే—అయితే ప్రొఫెసరుగారూ! బాగుండలేదా!

సంగం—నే నంటే ఆగుతుందా! నిన్ను దేశదేశాలా మెచ్చుతోంటే, నేను కోన్‌కిసాగాణ్ణి అని ఏంలాభం.

రాధ—బుద్ధిమంతులు ఎవళ్లూ మెచ్చుకోటం లేదు. వాళ్ల సంఖ్య తక్కువేగామా లోకంలో.

రెనడే—పూర్వం ఇట్లాఅంటే వూరుకొనే వాణ్ని కాదుగాని యిపుడు మీరన్నమాటలే నిజమాఅని పిస్తోంది.

సంగం—ఒకడవన్నా బాగుపడ్డావు.

నాయుడు—(ప్రవేశించి) ఏదో కాలక్షేపం చేస్తున్నారు.

రాధ—ఏమాత్రం వదిలింది.

రెనడే—అలవాటేగా?

వసుధ—(ప్రవేశించి నిలుచుండును)

నాయుడు—ఆయన్ని తిప్పటం మహాకష్టమైంది. నాశాయశక్తులా ప్రయత్నించాను. అట్లాంటివాణ్ని ఇబ్బంది పెట్టటం ఎందుకని డబ్బిచ్చి పంపించాను. మిమ్మల్ని వదలిపెట్టినా మీకుమారుడన్నమాట మరచిపోలేక యిచ్చాను.

వసుధ—ఎక్కడో అక్కడ మీపుణ్యమా అని బ్రతికివుంటే చాలు. ఇవ్వాళ మీరందరూ మాయింటికి భోజనానికి రావాలి. నాయుడుగారూ మీరు వారి ముగ్గురిని తీసుకురావాలి.

రాధ — మేమందరం కలసి భోంచేస్తాం. మీకిష్టమేనా?

వసుధ—అది నాకొడుకుకన్న ఎక్కువచెడిపోవటం కాదుకదా!

సంగం—కవీశ్వరుడు!

నాయుడు—అలాగేగాని, యెందుకు? సరేలెండి.

(తెర)

దశమాంకము

[వసుధయిల్లు - రాత్రి - వసుధ, భగీరథశాస్త్రి, రాధ, నాయుడు, సంగం.]

వసుధ—రామనాథంగారు రాకపోవటమే లోపమండి.

రాధ—ఆయన రైలుకి వెళ్లాడు. మరేంచేస్తాం.

వసుధ—దయచెయ్యండి. తాంబూలం స్వీకరించండి.

సంగం—తాంబూలం వేసుకొనేందుకు ఖాళీ లేదండి.

వసుధ—పేదవాళ్లయింట్లో భోజనానికి అంత శ్లాఘ ఎందుకు.

సంగం—మీరు పేదవాళ్లే కావచ్చు. కాని భోజనం అల్లా లేదు.

నాయుడు—ఈభోజనం ఎందుకు? ఈవిందు ఎందుకుఇచ్చినట్లో తెలియలేదు. కొడుకు పెళ్లికా?

వసుధ—బాగా ఓదారుస్తున్నారు.

సంగం—బావగారికి బుద్ధి పరారిఅయింది.

వసుధ—మీరుచేసిన పనేగా ఆయన్ని మన మాట వినకండా చేశారు.

సంగం—ఆయన మేఘాలమీద ఎగిరిపోతున్నాడు.

నాయుడు—వరసకాదుకాని, వీలుగా వుంది మీకు?

సంగం—నాకు రైలుటైము అవుతోంది. వెళతాను.

వసుధ—ఇప్పుడే మిమ్మల్ని ఒకటి అడగాలని అనుకుంటున్నాను. అడగమంటారా!

సంగం—అడగండి.

వసుధ—చచ్చిపోయింతరువాత ఆత్మ ఏమవుతుంది? ఆఆత్మపొందే మార్పు చచ్చిపోయేపద్ధతుల ననుసరించి వుంటుందా?

సంగం—మెస్మరిజం అంటే యోగంలో ఒక తక్కువరకం సాధన. మెస్మరిజం చేసేవాడికి ఏమీ తెలియదు. ఈ జీవితంతరవాతసంగతులకి ఋషుల వాక్యాలే ప్రమాణం. ఒక్కొక్కడిమతం ఒక్కొక్క మోస్తరు వుంటుంది. ఋషులు తమయోగసమాధిలో వుండి వాళ్లు చూశారు, చెప్పారు. మనం వాళ్లని అనుస

రిస్తాం. ఇంతే. నా కెక్కువ తెలియదు. మీనాయనగా రుండగా వారికన్న మా కెక్కువ తెలుసునా?

వసుధ—ఆత్మహత్య చేసుకొంటే నరకలోకానికి పోతారంటారు. నిజమా?

సంగం—చచ్చేటప్పుడు ఆత్మ ఘోరబాధ అనుభవిస్తుంది. కనుక పోనూవచ్చు.

వసుధ—యుద్ధంలో చస్తే స్వర్గానికి పోతాడంటారు. ఈజీవయాత్ర యుద్ధంవంటిది. ఇందులో చస్తే ఎందుకు పోరాదు. కత్తితో చేస్తేనేనా యుద్ధం.

రాధ—ఇంగ్లీషులో జీవితాన్ని యుద్ధంతోనే పోలుస్తారు.

సంగం—మీఅబ్బాయి యిల్లా లేచిపోతే మీరు కదలకండా మెదలకండా వున్నారు. మీరు యుద్ధవీరులంటివారనే చెప్పవచ్చు.

వసు—మనంచేసే దేముంది. కలి అల్లా విజృంభిస్తోంది.

భగీ—కళింగమంటే అంతే. కలి అంటే పాపం. 'కలింగచ్ఛతీతి కలింగః' అని, పాపమును పొందేవాడు కలింగుడు. వాడూ వాడిరాజ్యం కళింగరాజ్యంఅయింది.

సంగం—బాగాఅన్నారు బాబూ. సెలవు నాయుడుగారూ!

నాయుడు—బావగారూ అనాలి!

సంగం—మీదయ. సెలవు. అమ్మా సెలవు.

నాయుడు—నేను బావగారిని పంపించివస్తా.

వసుధ—మళ్లీరావట మెందుకు, కష్టాలన్నీ తీరిన హరిశ్చంద్రమహారాజల్లే సుఖించక.

(అందరు నవ్వుదురు)

నాయుడు—బావగారి దయవల్ల మళ్లీ పెళ్లికొడుకల్లే వున్నాను. మీరంతరూ పరాగమాడటం తప్పేమీలేదు.

భగీ—ఇంత అమాయకుడవు కనుకనే దేవుడు నిన్ను దయచూశాడు. బాబూ! సుఖపడు.

సంగం—పెద్దలు, మీఆశీర్వాదము.

(నాయుడు, సంగం నిష్క్ర.)

రాధ—నేనూ వెళతాను.

భగీ—ఇక్కడ పడుకోండి బాబూ ఈరాత్రికి.

వసుధ—నాయుడుగారిని ఏకాంతంగా వుండనీయండి. పాపం. ఎన్నాళ్లకి ఆయనకాపురం కుదట పడ్డది. ఆ యస్థితి చూస్తే ఇక నాకు సుఖంగా నిద్దర పడుతుంది.

రాధ—ఆయనకష్టం మీ రేమనుభవించారు.

వసుధ—మేమిద్దరమూ ఒకరికష్టా లొకరు అనుభవించాము.

రాధ—ఆయనకష్టాలు తీరినై. మీ రేంచేస్తారు. ఇంక మీకష్టాలు ఎట్లా తీరుతవి.

వసు—నాకష్టాలు తీరేయోగ్యత వుంటే మాకళింగ అల్లా ఎందుకవుతాడు. పోయి పడుకొంటాను.

(నిష్క్ర).

భగీ—బాబూ! పడుకోండి.

(ఇద్దరూ పడుకొందురు)

భగీ—మీరువ్రాసిన పద్యాలు ఏమన్నా చదువుతారా!

రాధ—

ఇంటిలోన సర్పము ప్రవేశించి భయము
కలుగఁజేయు చెల్లెడఁ దిరుగాడినట్లు
అల్ల నల్లనఁ బడి తిరుగాడఁజొచ్చె
నాదు మనసున నేదో విషాదరేఖ.

తొల్లి నిజముగ నే నొక దుఃఖలోక
వాసుఁడను నా కచట నిల్లువాకిలియును
గలదు చిఱుగొంతు మలచు చీకటులపాట
పాడిపోవంగ నిచటికి వచ్చినాను.

భగీ—బాబూ! ఎంతగొప్పకవివి? ఇంకెవ్వయినా?

రాధ—

పలుగురాచిన నాగొంతు మలగిమలగి
రాగ మెడలించె బీఁటవరాలు బిగిసె
పరమచరమార్ధగీతిక పలుకలేని
మెట్లు కిన్నెరతీగలు చిట్లిపోయె.

ఓ ప్రణయశీల నేను నిశాప్రశాంత
గాఢతమసాకృతిని నీవు కలలోదిగిన
చటులసౌదామనీరేఖ విటుల నాదు
దివ్యసన్నిధికే దారితీసినావు.

భగీ—బాగుంది. చక్కని ధార. ఒకానొక విచిత్రమైన మానసికస్థితిని చిత్రించావు. శబ్దాలుకూడా మధురంగానే కూర్చావు.

రాధ — ఇందులో బుచ్చిమామగారు తప్పులన్నారు. 'కలలోదిగిన' ఏమిటన్నారు?

భగీ—అది మన సాంప్రదాయం కాదు. దానికేమిలే. వస్తోంది. (నిద్రించును)

రాధ—ఈయన కప్పుడే నిద్రపట్టింది. నాకా నిద్రపట్టుతుంది. వసుంధర నామనస్సులో కూర్చుంటే నాకు నిద్ర యెలా పట్టుతుంది. పాపం. ఆవిడను కొడుకు పరిత్యజించాడు. నాయుడు పరిత్యజించాడు. నాయుడు ఇంకా ఈవిడవంక చూస్తాడా? లోకమంతా స్త్రీ ముఖంగా పోతోంది. Ibsen 'Lady of the sea' అన్న గ్రంథంలో ఈసంగతి ఎంతబాగా వ్రాశాడు. లోకంలో నేనొక దుఃఖమయజీవిని. ఈవసుధ నా కన్న. నామనస్సావిడకేసి లాగుతోంది.

రాత్రి రెండుజాములు దాటింది. శాస్త్రిలుగారు సుఖంగా నిద్రపోతున్నాడు. ముసలివాడి కింత బాగా నిద్రపట్టుతున్నందుకు చెప్పాలి. జీవితమంతా పరిశుద్ధంగా గడిపాడు కాబోలు. నిద్రపట్టక ఏంచేస్తుంది.

వసుధ నిద్రపోతోందా? ఆవిడకి యివ్వాళ నిద్ర పడుతుందా? నాయుడు ఆనందవీథీవిహారం చేస్తున్నాడు కాబోలు. నామనస్సు కర్రదెబ్బతిన్న పాముల్లే మధ్యకు తునిగి అల్లల్లాడుతోంది.

తొల్లి నిజముగ నేనొక దుఃఖలోక
వాసుడను నాకచట నిల్లు వాకిలియును
గలదు చిలుగొంతు మలచు చీకటులపాట
పాడిపోవంగ నిచటికి వచ్చినాను.

వసుధను లేపి అడిగిచూస్తా. ఆవిడయిష్టమైతే నేనెందుకు పెళ్లాడరాదు. ఆవిడ నాయుణ్ణితప్ప ఇంకెవ్వరినీ ఎరగదల్లేవుంది. నాయుడు ధనవంతుడు. నేను కాదు. నేను కవిని. నాయుడుకన్న అందగాణ్ణి. అతనికన్న ఎక్కువసంస్కారంకలవాణ్ణి. ఆవిడకి నామీద ప్రేమ వుండల్లేవుందికూడాను. ఆవిడమనస్సులో కామప్రవృత్తి చాలావుంది. నాయుణ్ణిగూర్చి ఎంతపరాచికం ఆడింది. పోయి నిద్రలేపుతాను. (నడచి) చివరకి ఇది రసాభాసం అవుతుందేమో? ఆవిడకు నామీద ప్రేమ వుందని ఎట్లా? (పోయి పండుకొనును.)

కాదు, పోయి అడుగుతా. వీడుమించివస్తే రైలుకు పట్టిద్దాం. ఛీ! ఛీ! ఇదేమి కర్మమోకాని నా మనస్సు కవితావిషయాల్లో ఎంతఉత్తాలంగా పోతోందో తక్కినవిషయాల్లో అంతఅధమంగా నడుస్తోంది. నాకు భయమేస్తోందేమిటి? పోయిచూస్తా! వసుధా! వసుధ. (నిష్క్రమించి)

(మరల ప్రవేశించి)—(ఆవేశంతో) శాస్త్రిగారూ! శాస్త్రిగారూ!

భగీ—(లేచి) ఏమిటి? నాయనా!

రాధ—పోయి మీఅమ్మాయిని చూచిరండి.

భగీ—ఏమి? (వెళ్లివచ్చి ఉత్తరంతో)

భగీ—నాయనా అనుకొన్నంతా అయింది. నీవు పోయి నాయుడుగారిని పిలుచుకువస్తావా!

(రాధ నిష్క్రమించును.)

భగీ—(ఉత్తరం చదువుతూ) తల్లీ! ఆత్మహత్య తప్పని చెప్పానుకదమ్మా! ఎంతచక్కనివురి పోసుకొన్నావు. (మూర్ఛ)

(నాయుడు, చంద్రమతి ప్రవేశింతురు)

నాయుడు—అయ్యో! చంద్రం! ఏమిటీగతి?

చంద్ర—పడిపోతారేమో! నన్నానుకు నుంచోండి.

భగీ—(తెలిసి) నాయనా! చివరకు నాగతి యిల్లావచ్చింది.

(నాయుడు, చంద్రమతి లోనికి పోదురు)

రాధ—(ప్రవేశించి) ఎంతచక్కని వురిపోసుకుంది. ఈప్రయత్నం ఈవిడ చాలారోజులనుంచి చేస్తున్నట్లుంది.

(నాయుడు, చంద్రమతి ప్రవేశింతురు)

రాధ—పెట్టెమీద పెట్టె, పెట్టెమీద పెట్టా పెట్టింది. దానిమీదనుంచి ఉరిపోసుకుంది. సన్నని పగ్గం ఆమడంలోతడిపి అట్టిపెట్టింది.

చంద్రం—అది అయిదారురోజులు నానితేగాని అల్లాకాదు.

రాధ—కాళ్లకి తిరగలిరాళ్లు కట్టుకుంది. సరిగ్గా చెరసాలల్లో ఇల్లాగే చేస్తారు.

చంద్రం—కళింగానికి టెలిగ్రాం ఇస్తే.

రాధ—అతను రైలులో వుంటాడు. అయినా తండ్రికి తద్దినంపెట్టనివాడికి తల్లి చచ్చిందంటే లెక్కా!

చంద్రం—(నాయుడితో) ఏమిటి అల్లా వున్నారు.

భగీ—తల్లీ! ఆయన్ని జాగ్రత్తగా చూసుకో!

చంద్రం—(నాయుడిమొగంలో మొగం పెట్టి) నేను బ్రతికేవున్నా!

నాయుడు—(శ్వాసతీసికొని చంద్రాన్ని దగ్గరకు లాగుకొనును.)

చంద్రం—నన్ను వదలిపెటతారా!

నాయుడు—నీకోసమే బ్రతుకుతా!

చంద్రం—మీరు బ్రతుకుతానంటే నేను బ్రదికాను.

నాయుడు—క్రొత్తగా వచ్చినలాభం ఇంకో నష్టాన్ని పరిగణించనీయదు. (పోయి శాస్త్రిగారి కాళ్ల మీద పడి యేడ్చును.)

భగీ—నాయనా! జంతువులు స్వకర్మానురూపంగా వికారంపొందుతవి. దానికి దుఃఖించటం ఎందుకు.

నాయుడు—కళింగాన్ని రమ్మని టెలిగ్రాం కొడతా.

శాస్త్రి—నీటెలిగ్రాం వాడికి రేపు చేరుతుంది. వాడు ఎల్లుండి వస్తాడు. తల్లిశవాన్ని ఎల్లాగూ చూడలేడు. పైగా వాడు వచ్చి కర్మచేసేది లేదు. నేనున్నాగా. నేనే చేస్తాను.

నాయుడు—బాబూ! ఇంక మీరు బ్రతికేదెల్లాగా!

శాస్త్రి—నాయనా! మన మతం అందరికీ చక్కనిఏర్పాట్లు చేసిపెట్టింది. నాకు కూతురిమీద మమత లేకపోతే ఎప్పుడో సన్యసించాలిసింది. ఇపుడు చూడు నిర్విచారంగా చేస్తాను ఆపని. కర్మలు పన్నెండు రోజులు అయింతరవాత యీయిల్లు కళింగానికి. నీవు వాడికి యీకొంచెమాస్తి అప్పగించు.

నాయుడు—మీకున్న ధైర్యంలో ఒక్కలేశం నాకు లేదు.

భగీ— బ్రతికి బట్టకట్టాలసినవాడవు నీవు. నేనొకకాలు ఇక్కడ, ఇంకోకా లక్కడా వున్నవాణ్ని.

రాధ—

ఈమహాంధకారమ్మున నేనొకండ
కర్కశకకోరఘూకసంఘాతరావ
కుటిలముగ గొంతుచీల్చుక కూయుచుంటి
ఈవిపాదకీచకసమావృతగుహాళి.
చిటపెట రగుల్చుకొనుచున్న చితి, మదీయ
జీర్ణదేహాస్థి పెటిలి యుద్గీర్ణరవము
జ్వలదనలజిహ్వకోగ్రహాసమ్ము ననుస
రించి నాపూర్వగీతి స్ఫురింపఁజేయు.

భగీ—హా! హా! మహాకవి!

నాయుడు—చంద్రం! నీచేతులు నామెడమీద నెయ్యి! (చంద్రం అట్లుచేయును)

నాయుడు—నువ్వా ఆవిడా అన్నసందేహం వున్నన్నాళ్లూ ఇద్దరూ బాగానేవున్నారు. నీవని తేలిపోవటంతోటే ఆవిడ తన అగత్యం తీరిందనుకొని వెళ్లిపోయింది. ధర్మమే జయించింది.

భగీ—ధర్మము జయించటమే వసుంధరా కళ్యాణం. (తెర)

(ఓంతత్సత్)